క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన సోమవారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పలు అభివృద్ధి పనులపై చర్చించనున్నామని పేర్కొన్నారు. కౌన్సిలర్లు, అధికారులు, హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన బలిజ విద్యార్థులను ఆదివారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో బలిజ కాపు సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేసి సన్మానించారు. సమితి చైర్మన్ దండెదస్తగిరి, అధ్యక్షుడు కొప్పుల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నాగన్న, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పడకండ్ల సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. దాదాపు 60 మంది విద్యార్థులకు రూ.లక్ష వరకు నగదు అందజేశారు. దాతలు వర్ధంశెట్టి జంబులన్న ట్రస్టు ద్వారా విద్యావతి, గోరంట్ల రామకృష్ణ, హరినాథ్, దాతల సహకారంతో విద్యార్థులకు పురస్కారాలు అందజేసినట్లు చెప్పారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్యదర్శి మృతి



జయరాముడు(ఫైల్)

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నె పంచాయతీ కార్యదర్శి జయరాముడు (55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మద్దికెర మండలం అగ్రహారం గ్రామానికి చెందిన ఆయన దాదాపు 25 సంవత్సరాలుగా మండలంలోని పలు పంచాయతీల కార్యదర్శిగా విధులు నిర్వహించారు. నెల నుంచి అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ పలుచోట్ల చికిత్స చేయించినప్పటికీ కోలుకోలేక మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

క్రీడాకారుడికి సన్మానం



విశ్వనాథ్‌ను అభినందిస్తున్న సెబ్ సీఐ చంద్రావతి

ఆళ్లగడ్డ: పట్టణానికి చెందిన డీఎస్‌ఎన్ విశ్వనాథ్ ఈ ఏడాది మార్చి 27 నుంచి 31వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. ఆదివారం పట్టణంలోని శిల్పా వెంచర్‌లో డాక్టర్ రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాపీ సండే కార్యక్రమంలో ఆళ్లగడ్డ సెబ్ సీఐ చంద్రావతి విశ్వనాథ్‌ను సన్మానించి ప్రశంసా పత్రం, మెడల్ అందజేశారు. రమణారెడ్డి, కోచ్‌లు సుబ్బరాయుడు, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

రుతుచక్ర పరిశుభ్రతపై అవగాన



ప్రతిజ్ఞ చేస్తున్న ఆశా వర్కర్లు

ఆళ్లగడ్డ: స్థానిక పురపాల సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో రుతచక్ర పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రుతస్రావం అనేది ఒక సహజమైన ప్రక్రియ అని, ఆ సమయంలో తప్పని సరిగా శుభ్రత పాటించాలని మెప్మా జిల్లా మిషన్ కోఆర్డినేటర్ రాములు సూచించారు. కార్యక్రమంలో మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు వెంకటసుబ్బయ్య, లక్ష్మీదేవి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సాక్షిగణపతి వద్ద ట్రాఫిక్ జామ్



ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలు

శ్రీశైలం: శిఖరం – శ్రీశైలం మధ్య ఉన్న సాక్షిగణపతి ఆలయ సమీపంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దాదాపు రెండు గంటల పాటు భక్తులు అవస్థలు పడ్డారు. ఆదివారం సెలవు రోజు కావడం, ఇటీవల పది, ఇంటర్ ఫలితాలు వెలువడటంతో మొక్కుతీర్చేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడం, అదే సమయంలో శనివారం మల్లన్నను దర్శించుకున్న భక్తులు ఆదివారం తిరుగు ప్రయాణం కావడంతో ఈ మార్గంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు సాక్షి గణపతి ఆలయం వద్దకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

అతివల అభివృద్ధికి.. మహిళా సమ్మాన్

- తపాలాలో పెట్టుబడులతో ఆర్థికాభివృద్ధి
- తక్కువ కాల వ్యవధిలో అధిక వడ్డీ
- మూడు నెలలకొకసారి ఖాతాలో వడ్డీ జమ

మహిళా సమ్మాన్ సేవింగ్ పథకం లబ్ధి ఇలా..

డిపాజిట్	రెండేళ్ల తర్వాత వచ్చే మొత్తం
రూ.1000	రూ.1.154
రూ.10 వేలు	రూ.11,542
రూ.50 వేలు	రూ.57,714
రూ.లక్ష	రూ.1,15,428
రూ.2లక్షలు	రూ.2,30,854

నంద్యాల: మహిళా సమ్మాన్.. బచత్ పత్ర యోజన పథకం ఓ స్వల్పకాలిక పథకం. ఇందులో డబ్బును రెండేళ్ల పాటు పెట్టుబడి పెట్టవచ్చు. ఈ పథకం కింద వార్షిక ప్రాతిపదికన 7.5 శాతం వడ్డీ లభిస్తుంది. ఈ పథకం ఎఫ్‌డీ లాంటిది. తక్కువ కాల వ్యవధిలో మెరుగైన వడ్డీ పొందవచ్చు. ఇందులో పెట్టుబడి పెట్టడానికి వయో పరిమితిని నిర్ణయించలేదు. పథకం మధ్యలో డబ్బు అవసరమైతే పాక్షిక ఉపసంహరణకు అనుమతి ఉంది. ఈ పథకం ఈ ఏడాది ఏప్రిల్ 1న ప్రారంభమైంది. పథకంపై తపాలా శాఖ అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

వన్‌టైం సేవింగ్ స్కీం..

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం వన్‌టైం సేవింగ్స్ స్కీంగా తపాలా అధికారులు పేర్కొంటున్నారు. ఈ స్కీమ్‌లో చేరే అమ్మాయిలు, మహిళలు కనీస పెట్టుబడి రూ.వెయ్యి నుంచి రూ.2లక్షల వరకు ఒకేసారి డిపాజిట్‌గా చెల్లించవచ్చు. గరిష్ట మొత్తానికి రూ.2లక్షలలోబడి ఎన్ని ఖాతాలైనా తెరిచే అవకాశం ఉంది. ఇప్పటికే ఖాతా ఉంటే కనీసం మూడు నెలల విధానంతో మళ్లీ ఖాతా తెరవవచ్చు. సేవింగ్స్ ఖాతా ప్రారంభించిన తేదీ నుంచి రెండేళ్లు పూర్తయిన తర్వాత మెచ్యూరిటీ కింద డబ్బులు డ్రా చేసుకొనే అవకాశం ఉంటుంది. అయితే వడ్డీ రేటు మాత్రం ఏడాదికి 7.5 శాతం ఉంటుంది. అయితే ఒకరి పేరుతోనే ఖాతా తెరవాలి. జాయింట్ అకౌంట్ సౌకర్యం లేదు. మైనర్ అయితే గార్డియన్ ద్వారా డిపాజిట్ చేసుకునే వీలుంది.

స్కీమ్‌లో చేరాలంటే..

- మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ స్కీంలో చేరాలంటే ఆధార్, పాన్‌కార్డు, మూడు ఫొటోలతో సమీప పోస్టాఫీసుకు వెళ్లి ఖాతా ప్రారంభించవచ్చు.
- డిపాజిట్ చేసిన వారు ఏడాది తర్వాత 40 శాతం డబ్బు ఉపసంహరించుకొనే అవకాశం ఉంటుంది.
- ఒక వేళ డిపాజిట్‌దారులు మరణిస్తే కారుణ్యం కింద ఖాతా మూసివేయవచ్చు.
- ఎవరైనా మృతి చెందితే తదుపరి నామినికి మొత్తం డబ్బు చెల్లిస్తారు.
- అవసరాన్ని బట్టి 2శాతం తగ్గించుకొని 5.5శాతం వడ్డీతో ఆరు నెలల తర్వాత ఎప్పుడైనా ఖాతా మూసివేయవచ్చు.

పథకంలో ఇప్పటికే 330 మంది చేరిక..

నంద్యాల జిల్లాలో ఒక హెడ్‌పోస్టాఫీసు, 48 సబ్ పోస్టాఫీసులు, 282 బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. ఈ పోస్టాఫీసుల పరిధిలో ఇప్పటికే 330మంది మహిళలు పథకంలో చేరారు. జిల్లాలోని మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొనేలా తపాలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.



మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంలో చేరిన మహిళలు

మహిళలకు మాత్రమే



తపాలా శాఖలో ప్రత్యేకంగా.. పెట్టుబడిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి చిన్న మొత్తాల పొదుపు పథకం కింద ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రభుత్వం మహిళా సమ్మాన్ సేవింగ్ పథకాన్ని ప్రారంభించింది. ఎక్కువ రాబడి పొందేలా సంవత్సరానికి 7.5 శాతం వడ్డీని ప్రకటించింది. ఇందులో రూ.వెయ్యి నుంచి రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. పథకం కాల పరిమితి రెండేళ్లు మాత్రమే. పథకం కింద వచ్చే వడ్డీని ప్రతి మూడు నెలలకు ఒకసారి ఖాతాలో జమ చేస్తాం.

– శ్రీనివాసరావు,
పోస్టల్ సూపరింటెండెంట్, నంద్యాల

విద్యుత్ సమాచారం

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందజేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ భగవాన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

సమాచారం

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారని, అక్కడ న్యాయం జరగకపోతే మండల స్థాయిలో జరిగే కార్యక్రమంలో అర్జీలు అందజేయాలని సూచించారు.

ఆరిఫ్‌కు గౌరవ్ సమ్మాన్ అవార్డు



డాక్టర్ హాజీ అన్సారి నుంచి అవార్డు అందుకుంటున్న మౌలానా అబ్దుల్ మజీద్ ఆరిఫ్

చాగలమర్రి: పట్టణానికి చెందిన వరల్డ్ హ్యూమన్ రైట్స్ కమిషన్ నేషనల్ ఆర్గనైజ్ కార్యదర్శి మౌలానా అబ్దుల్ మజీద్ ఆరిఫ్‌కు భారత్ గౌరవ్ సమ్మాన్ అవార్డ్ దక్కింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని లక్నో పట్టణంలో ఆదివారం డబ్ల్యూహెచ్ఆర్‌సీ నిర్వహించిన 5వ అవార్డుల ప్రదానోత్సవంలో ఉత్తమ సేవలందించిన ఆరిఫ్‌ను అవార్డుకు ఎంపిక చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అవార్డును స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ హాజీ అన్సారీ నుంచి అందుకున్నట్లు చెప్పారు. మజీద్‌ను స్థానిక ముస్లిం మత పెద్దలు మౌలానా అబ్దుల్ సలాం, మౌలానా ఖలీల్, మౌలానా మహెబుబ్, మౌలానా గౌస్, హాఫీజ్ సులేమాన్ అభినందించారు.

పట్టుదలతోనే లక్ష్య సాధన

- కోల్స్ కాలేజీ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మదనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి

కర్నూలు (సిటీ): పట్టుదలతో చదివితే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చని మదనపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి. వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. కోల్స్ కాలేజీ 1988–1990 బ్యాచ్ ఆర్ట్స్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. నగరంలోని స్థానిక శ్రీలక్ష్మి కల్యాణమండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమకు కాలేజీలో విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించడంతో నేడు మంచి స్థానాల్లో ఉన్నామన్నారు. అయితే, ఇందుకు కారణమైన గురువులను ఎప్పటికీ మరువకూడదన్నారు. కోల్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి మాట్లాడుతూ కాలేజీకి ఎంతో చరిత్ర ఉందన్నారు. ఇక్కడ చదివిన వారు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. ఇటీవలే కాలేజీకి ప్రతిభ అవార్డు కూడా వచ్చినట్లు చెప్పారు. అనంతరం అధ్యాపకులు మోజెస్, పాల్ అగస్టీన్, సీనియర్ జర్నలిస్ట్ సాయికుమార్ మాట్లాడారు.అంతకు ముందు పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ కాలేజీ తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. నాడు విద్యను బోధించిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటేష్ గౌడ్, ఎస్వీ మాదన్న, చంద్రశేఖర్, సుబ్బరాయుడు, ఎస్‌డీఎస్ రాజు, హరిప్రసాద్, రామ్మోహన్‌రెడ్డి, బాల రమేష్, దేవనకొండ రంగన్న, రత్నకుమారి, స్వర్ణకుమారి, వాసంతి, శ్యామల, సుమతి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో..



రేపల శ్రీనివాసరావుకు ఆహ్వానం పలుకుతున్న ఆలయాధికారి

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబామల్లికార్జునస్వామి వార్లను ఆదివారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ రేపల శ్రీనివాసరావు దర్శించుకున్నారు. క్షేత్రం చేరుకున్న ఆయనకు భ్రమరాంబా అతిథి గృహం వద్ద ఆలయాధికారికారులు ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన స్వామిఅమ్మవార్ల దర్శనార్థం ప్రధానాలయ రాజగోపురం వద్దకు చేరుకోగా ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక,వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు,ప్రసాదాలు అందజేశారు.

ఉత్తరాయణం లోపు కుంభాభిషేకం జరిపించాలి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో తలపెట్టిన మహా కుంభాభిషేకాన్ని ఉత్తరాయణ పుణ్యకాలంలోనే నిర్వహించాలని కామారెడ్డికి చెందిన మహదేవ్ స్వామీజీ తెలిపారు. ఆదివారం శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మల్లన్న దర్శనార్థ ఆలయం వద్దకు వచ్చిన స్వామీజీకి ఆలయాధికారులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం స్వామీజీ మల్లికార్జునస్వామికి అభిషేకం, భ్రమరాంబాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాయణ పుణ్యకాలంలోనే మహా కుంభాభిషేకాన్ని జరిపించాలని ప్రభుత్వానికి, ఈఓకి విన్నవిస్తున్నానని చెప్పారు.

ఆధ్యాత్మికం

మారెమ్మకు ప్రత్యేక పూజలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామంలో నూతనంగా నిర్మించిన మారెమ్మ ఆలయంలో 21 రోజుల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్మాణం 8 నెలలకే పూర్తి చేసినందుకు ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్ రెడ్డి, సొసైటీ చైర్మన్ గోపవరం బాలవెంకటరెడ్డి ఆలయ కమిటీ సభ్యులు గోపవరం ఓబుళరెడ్డి, పొట్టిపాటి రామసుబ్బారెడ్డి, నిమ్మకాయల మల్లేశ్వర రెడ్డి, గోపవరం కాశీ విశ్వనాథ్‌రెడ్డి, జక్కుల పాములేటి, జక్కుల రాముడు, మల్లు శ్రీనివాసరెడ్డి, గుంటిక బాలయ్య, బండి శ్రీనివాసరెడ్డిను గ్రామస్తుల తరఫున సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు

మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు ఇచ్చారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు.

చిన్నారులకు ఉచిత ఖత్నా

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల దూదేకుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూర్ నర్సింగ్ హోం ఆవరణలో డాక్టర్ బాబన్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బాబన్ మాట్లాడుతూ ఏటా ఉచితంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. చిన్నారులకు రూ.5వేలు విలువ గల వస్త్రాలు, మాత్రలు, బ్రెడ్లు, అధునాతన పద్ధతిలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. సంఘం పెద్దలు వాసవీ దస్తగిరి, ఆదాం సాహెబ్, సోమశేఖర్, హుసేనప్ప, బాలహుసేన్, రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిలకు ప్రతిపాదనలు

దొర్నిపాడు: జల్‌జీవన్ మిషన్ ప్రోగ్రామంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ మంజూరుకు రూ.673.1లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ ఆదివారం తెలిపారు. అర్జునాపురం రూ.24.30లక్షలు, బుర్రారెడ్డిపల్లె రూ.52.90లక్షలు, చాకరాజువేముల 71.90, దొర్నిపాడు 119.90, గుండుపాపల 32.90 లక్షలు, ఉమాపతినగరం 54.90 లక్షలు, కొండాపురం 36.10, క్రిష్టిపాడు 55.50 లక్షలు, రామచంద్రాపురం 39.90లక్షలు, డబ్ల్యూ గోవిందిన్నె రూ.67.70 లక్షలు, డబ్ల్యూ కొత్తపల్లె 117.10 లక్షలకు ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు.



ముస్తాబైన అటవీ కార్యాలయం,



ప్రారంభానికి సిద్ధమైన రేంజర్ నివాస భవనం

ప్రారంభానికి సిద్ధంగా..

- తుది మెరుగులు దిద్దుకున్న అటవీశాఖ భవనాలు
- భవనాలను పరిశీలించిన డీఎఫ్ఓ వినీత్ కుమార్

రుద్రవరం: స్థానిక అటవీ కార్యాలయ ప్రాంగణంలో రెండు భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. దాదాపు రూ.4లక్షలతో అధికారులు మరమ్మతులు చేయించి ముస్తాబు చేశారు. ఆయా భవనాలను డీఎఫ్ఓ వినీత్ కుమార్ ఆదివారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితం రుద్రవరం అటవీ కార్యాలయ ప్రాంగణంలో రేంజి అధికారికి, హెడ్‌క్వార్టర్ సెక్షన్ ఆఫీసర్ కోసం దాదాపు రూ.50 లక్షలు వెచ్చించి రెండు భవనాలు నిర్మించారు. అయితే భవనాల నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్లు పనులు అసంపూర్తిగా వదిలేశారు. సరైన వసతులు లేక పోవడంతో ఆ భవనాల్లో చేరలేదని అధికారులు పేర్కొన్నారు. ఈ విషయంపై గత నెల 17న సాక్షిలో ప్రారంభమయ్యేనా..అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి అటవీ అధికారులు స్పందించారు. అసంపూర్తిగా ఉన్న రెండు భవనాల్లో దాదాపు రూ.1.5 లక్షలు వెచ్చించి వసతులు కల్పించారు. అలాగే దెబ్బతిన్న కార్యాలయ భవనానికి మరో రూ.2.5 లక్షలతో మరమ్మతు పనులు చేయించి ప్రాంభానికి సిద్ధం చేశారు. కాగా..సోమవారం పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) మధుసూదన్ రెడ్డి, సీఎఫ్ (చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) శ్రీనివాసరెడ్డి, డీఎఫ్ఓ వినీత్ కుమార్ భవనాలను ప్రారంభించనున్నారు.

మహానందిలో భక్తుల రద్దీ



మహానంది కోనేరులో స్నానాలాచరిస్తున్న భక్తులు

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. వేలాది సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ఆవరణలు కిటకిటలాడాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. భక్తుల రద్దీ నెలకొనడంతో వసతి గృహాలకు డిమాండ్ నెలకొంది. దేవస్థానానికి చెందిన వసతిగదులు నిండిపోవడంతో ప్రైవేటు లాడ్జీల యజమానులు సాధారణ రోజుల కంటే అధిక ధరలు వసూలు చేయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. పట్టణాల తరహాలో లాడ్జీల వద్ద నిర్ణీత ధరలు వసూలు చేసేలా ధరలు సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరారు.



దర్శనం అనంతరం బయటికి వస్తున్న భక్తులు

నీటి సమస్యకు అడ్డుకట్ట

- రూ.20లక్షలతో తెలుగుగంగ ప్రధాన కాల్వలో అడ్డుకట్ట
- గండ్లేరు రిజర్వాయర్‌లో తగ్గని నీరు
- ఆళ్లగడ్డతో పాటు 35 గ్రామాలకు తొలగిన నీటి ఎద్దడి



తుండ్లవాగు జలాశయంలో నిల్వ ఉన్న నీరు

రుద్రవరం: తెలుగుగంగ కాల్వల నిర్మాణ సమయంలో అప్పటి పాలకులు నల్లమల అటవీ ప్రాంతంలో దాదాపు అర టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యంతో గండ్లేరు (తుండ్ల) రిజర్వాయరు నిర్మించారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి నీరు విడుదల చేసినప్పుడు తెలుగుగంగ ప్రధాన కాల్వ ద్వారా ఇటు రుద్రవరానికి, అటు హరినగరం సమీపంలోని రిజర్వాయరులోకి నీరు చేరేది. రిజర్వాయరు నిండగానే వైఎస్సార్ జిల్లా బ్రహ్మసాగర్ రిజర్వాయర్‌కు సరఫరా చేసేవారు. అయితే వర్షాలు తక్కువగా ఉన్న సమయంలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మంచినీటి సమస్య నెలకొనేది. సమస్యను అధిగమించేందుకు వైఎస్సార్ హయాంలో హరినగరం వద్ద ఎస్‌ఎస్ ట్యాంక్ నిర్మించారు. తుండ్లవాగు నుంచి బోరు మోటార్లు, పైప్ లైన్ ద్వారా ట్యాంక్‌కు నీరు సరఫరా చేసేవారు. అక్కడ వడపోసి ఆళ్లగడ్డ పట్టణంతో పాటు ఆళ్లగడ్డ మండలం, రుద్రవరం మండలాల్లోని 35 గ్రామాలకు రక్షిత మంచి నీరు సరఫరా చేసే వారు. వెలుగోడు రిజర్వాయరులో నీటి నిల్వ సామర్థ్యం తక్కువ ఉన్నప్పుడు తెలుగుగంగ కాల్వలకు జనవరి నెలలోనే నీరు విడుదల నిలిపివేసే వారు. దీంతో మార్చి, ఏప్రిల్ నెలాఖరుకే తుండ్లవాగులో నీటి నిల్వలు తగ్గిపోయేవి. అలాగే రిజర్వాయరు ఎగువ భాగంలో ఉండటంతో అందులోని నీరు టీజీపీ ప్రధాన కాల్వలో నుంచి వెనుక వైపునకు పారుతూ 22వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ నుంచి వృథాగా ప్రవహించేది. అటు ఎండ తీవ్రతకు ఆవిరి కావడం, ఇటు వృథాగా దిగువకు పారడంతో రిజర్వాయరులో నీటి నిల్వలు వేగంగా అడుగంటేవి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. సమస్యను మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి టీజీపీ అధికారులతో చర్చించారు. గతేడాది ప్రభుత్వం నుంచి దాదాపు రూ.20లక్షలు మంజూరు చేయించి 22వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ వద్ద నీరు వృథా కాకుండా కాల్వలో కాంక్రీటుతో అడ్డుకట్ట నిర్మించారు. అలాగే ఆ బ్లాక్ తూముకు మరమ్మతులు, కాల్వకు ఇరువైపులా కాంక్రీటు పనులు చేయించారు. ఆ అడ్డుకట్ట ఇప్పుడు ఎంతగానో ఉపయోగపడుతోంది. నీరు వృథా కాకుండా అడ్డుకుంది. దీంతో రిజర్వాయరులో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. మే నెల వచ్చినా నీటి సమస్య తలెత్తకుండా ఉపయోగపడింది.



22 బ్లాక్ కాలువలోకి నీరు వృథాగా ప్రవహించకుండా నిర్మించిన అడ్డుకట్ట

నీటి హక్కులను తెలియజేసేందుకే దీక్ష

జూపాడుబంగ్లా: రాయలసీమ రైతాంగానికి ప్రజలకు సాగునీటి హక్కులను తెలియజేసేందుకే జల జాగరణ దీక్ష చేపడుతున్నామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని మండ్లెం గ్రామంలో రైతులు చేపట్టిన జలదీక్షకు సంఘీభావం తెలిపారు. అనంతరం జూపాడుబంగ్లా, పారుమంచాల గ్రామాల్లోని రైతులను కలిసి వారిని చైతన్యపరిచారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్ధేశ్వరం అలుగు నిర్మాణానికి శంకుస్థాపన చేసి నేటికీ ఏడేళ్లు పూర్తైన సందర్భంగా రైతులను చైతన్య పర్చుతూ కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం వద్ద ఈనెల 31న సాయంత్రం 6 నుంచి జూన్ 1తేదీ ఉదయం 10గంటల వరకు జల జాగరణదీక్ష చేపట్టనున్నట్లు చెప్పారు. నందికొట్కూరు నియోజకవర్గం చుట్టూ కృష్ణా జలాలున్నా ఎత్తిపోతల పథకాల్లేని కారణంగా నీటిని వినియోగంచుకోలేని దుస్థితి నెలకొందన్నారు. సమితి కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, మోక్షేష్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

కోవెలకుంట్ల: నంద్యాల మండలం చాబోలు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై ఆదివారం అదనపుకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. ఎస్ఐ అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు కుమార్తె లలితను నంద్యాల మండలం చాబోలుకు చెందిన రాంబాబుతో ఏడాది క్రితం వివాహం జరిపించారు. కట్నకానుకల రూపంలో నగదు అందజేశారు. కొంతకాలం వారి దాంపత్య జీవితం సజావుగా కొనసాగింది. అదనపుకట్నం తేవాలని కొన్ని రోజుల నుంచి భర్తతోపాటు అత్త జయమ్మ, ఆడపడుచు రమాదేవి మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారు. పుట్టింటికి చేరుకున్న బాధిత మహిళ లలిత ఫిర్యాదు మేరకు భర్త, అత్త, ఆడపడుచుపై 498ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ప్రిన్సిపాల్ జయమ్మ మాట్లాడుతూ కళాశాలలో పరీక్షకు మొత్తం 597 మంది కేటాయించగా 445 మంది హాజరయ్యారన్నారు. 152 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

తగ్గుముఖం పట్టిన డయేరియా

వెలుగోడు: గుంతకందాల గ్రామంలో డయేరియా తగ్గుముఖం పట్టింది. గ్రామానికి చెందిన పలువురు గత నాలుగు రోజులుగా విరేచనాలతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుండగా ఆదివారం మరో నాలుగు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో 9 మంది, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు చికిత్స పొందుతున్నారని వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు.